క్లుప్తంగా

అక్షింతల ఊరేగింపు

మదనపల్లె సిటీ: రామ జన్మభూమి అయోధ్య రామమందిర దివ్య అక్షింతలను మదనపల్లెలో శనివారం ఊరేగించారు. శ్రీ కోదండరామ స్వామి ఆలయం నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ వరాల ఆంజనేయ స్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్షింతలు జనవరి 1 నుంచి ప్రతి ఇంటికి పంపిణీ చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నిమ్మనపల్లె : అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ పి.రామకృష్ణ తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ..వాల్మీకిపురం మండలం విఠలం గ్రామానికి చెందిన సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన ట్రాక్టర్ మండలంలోని ముష్టూరు గ్రామం వద్ద బాహుదానది నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దిగువపల్లె వద్ద సిబ్బందితో కలిసి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న కారును సీజ్‌చేసి, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు. శనివారం మండలం చీకలబైలు చెక్‌పోస్ట్ వద్ద పట్టణానికి చెందిన షేక్‌అబ్దుల్‌బాషా(42), మూడే భాస్కర్‌నాయక్(32) కారులో 48 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం, 18 టిన్‌బీర్‌లు, మూడు ఫుల్‌బాటిల్స్ తరలిస్తుండగా, స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కారును సీజ్ చేశామని, మద్యం విలువ రూ.9వేలు ఉంటుందన్నారు. దాడుల్లో ఎస్‌ఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

పీలేరు : 2024 నూతన సంవత్సరానికి సంబంధించి యూటీఎఫ్ క్యాలెండర్లు, డైరీలను శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన సమాచారంతో రూపొందించిన డైరీలు బాగున్నాయని అభినందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రాధాకృష్ణ, సుధాకర్, సుబ్రమణ్యం, వేణుగోపాల్, విశ్వనాథరెడ్డి, కృష్ణమూర్తి, నసీమాబాను, శ్రీనివాసులు, సురేష్‌కుమార్‌రాజు, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

దండుమారెమ్మకు ప్రత్యేక పూజలు



తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగులో నూతనంగా నిర్మించిన దండుమారెమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట జరిగి 41 రోజులు పూర్తి అయిన సందర్భంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి శంకర్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పంచాయతీలోని అన్ని పల్లెల నుండి మహిళలు భక్తిశ్రద్ధలతో దీలు, బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్లి మారెమ్మకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద ఎత్తున అన్నసంతర్పణ చేశారు.

జూదరుల అరెస్ట్

నిమ్మనపల్లె : కోడిపందెం స్థావరంపై దాడులు నిర్వహించి తొమ్మిదిమందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. శనివారం మండలంలోని బండ్లపై పంచాయతీ సమీపంలో కొంతమంది కోడిపందెం ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి కోడిపందెం స్థావరంపై దాడులు నిర్వహించామన్నారు. దాడిలో తొమ్మిదిమందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4,480, రెండు పందెంకోళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ శివరామకృష్ణ, కానిస్టేబుల్‌లు సుమతి, రాజేష్, శివ, సంతోష్‌లు పాల్గొన్నారు.

నేటి రాత్రి నుంచి కఠిన నిబంధనలు

వాల్మీకిపురం: వాల్మీకిపురం సర్కిల్ పరిధిలో ఆదివారం రాత్రి నుంచి జనవరి 1 వరకు కఠిన నిబంధనలు అమలులో ఉంటాయని సీఐ సురేష్ కుమార్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా శాంతి భద్రతలకు ఎటువంటి భంగం వాటిల్లకుండా ఎవరి ఇంట్లో వారు సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. 31వ తేది రాత్రి పది గంటల నుంచి గుంపులు గుంపులుగా ఉండకూడదని, ఒకే వాహనం ముగ్గురు వెళ్లకూడదని సూచించారు. రాత్రి సమయంలో వాహనాల తనిఖీ ముమ్మరంగా ఉంటుందని, మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నిబంధనల మేరకే నూతన సంవత్సర వేడుకలు

నిమ్మనపల్లె : నూతన సంవత్సర వేడుకలను నిబంధనలకు అనుగుణంగా జరుపుకోవాలని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ 31వతేదీ ఆదివారం సాయంత్రం నుంచి పోలీసు నిబంధనలు అమలులో ఉంటాయన్నారు. అతిగా మద్యం సేవించి వాహనం నడపటం, రోడ్లపై ప్రజలకు ఇబ్బందికరంగా ప్రవర్తించినా, బహిరంగ ప్రదేశాల్లో కేక్‌లు కట్‌చేయడం, త్రిబుల్ రైడింగ్ వంటి చర్యలకు పాల్పడితే, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షేమ పథకాలతో ఇంటింటా ఆనందం

- ఎమ్మెల్యే నవాజ్‌బాషా
- బాలాజీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : కుల,మత,రాజకీయాలకు అతీతంగా, పేదరికమే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో ఇంటింటా ఆనందం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం మండలంలోని తట్టివారిపల్లె పంచాయతీ బాలాజీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సిద్ధలదీపా, వేమారెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి తదితరులు ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాంకు ఘనస్వాగతం పలికారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ నాలుగన్నరేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను అందించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గడపకు సంక్షేమం పేరుతో లక్షల రూపాయల లబ్ధిని అందించారన్నారు. అమ్మ ఒడి, రైతుభరోసా, సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ తదితర ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యుల సిఫారసు ఉంటే తప్ప పథకాలు అందని పరిస్థితి ఉంటే..నేడు వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు ఇంటివద్దకే అందిస్తూ సీఎం జగన్ ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాల ప్రజలు తమకు జగన్‌లాంటి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలిపిన జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యేగా పనిచేయడం తన అదృష్టంగా పేర్కొన్నారు. పేదలకు మంచి చేయడమే ధ్యేయంగా, వారి అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళుతున్న ముఖ్యమంత్రిని 2024 ఎన్నికల్లో మళ్లీ గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకే ఓటువేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, వెలుగుచంద్ర, జేసీఎస్ కన్వీనర్ పోతబోలునాగరాజ, వైఎస్సార్ సీపీ నాయకులు నీరుగట్టిరమణ, ఇస్మాయిల్, గుండ్లూరురఫీ, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, సదాశివరెడ్డి, చందూరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల

పీలేరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశాం... వచ్చే ఎన్నికల్లో మరోసారి ప్రజలు నిండు మనస్సుతో ఆశీర్వదించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పీలేరు పట్టణం తిరుపతి రోడ్డు, చిత్తూరు రోడ్డు, క్రాస్ రోడ్డు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించిన పథకాలు లబ్ధిదారులకు చదివి వినిపించారు. స్థానికులు సమస్యలు అడిగి తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు తన కుటుంబాన్ని అభివృద్ధి చేసుకున్నారు, తప్ప రాష్ట్ర ప్రజల అభివృద్ధి గూర్చి విస్మరించారని తెలిపారు. గతంలో 600 హామీలు గుప్పించి అమలు చేసింది శూన్యమని పేర్కొన్నారు. మరోసారి ఎన్నికలు దగ్గర పడడంతో ఇష్టానుసారం ప్రజలను మభ్యపెట్టే విధంగా హామీలు గుప్పిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఆయన కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోరాదన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు యథావిధిగా కొనసాగాలంటే వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు హబీబ్‌బాషా, ఎ.ఎస్. హుమయూన్, మహితాఆనంద్, స్టాంపుల నరసింహారెడ్డి, ఎస్.వి. చలపతి, భాస్కర్‌రెడ్డి, చక్రధర్, సురేంద్రనాథరెడ్డి, సి.వి.రెడ్డి, గ్యారంపల్లె సతీష్‌రెడ్డి, నాగభూషణం, అరుణ, మునీర్, అబీద్, హబీబ్‌బాషా, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదల సొంతింటి కల సాకారం

- నియోజకవర్గంలో 12,947 ఇళ్ల నిర్మాణాలు
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



బలసర పెంటలో వినతులపై స్పందిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లలో ఉంటూ ఇబ్బందులు పడిన నిరుపేదల సొంతింటి కలను వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాకారం చేసిందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. శనివారం ఆయన బి.కొత్తకోట మండలంలోని సూరపువారిపల్లె, గట్టు పంచాయతీలకు చెందిన కొత్తవుడియం, దయ్యాలవారిపల్లె, సూరపువారిపల్లె, నామాలపల్లె, బలసరపెంట, బురుజుపల్లె, చలిమామిడిల్లో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే పరిష్కారం కోసం అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడారు. సత్వరమే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించుకుని గృహప్రవేశాలు చేయాలని కోరారు. నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాలపై మాట్లాడుతూ నవరత్నాలు-పేదలందరికి ఇళ్లు పథకం ద్వారా 12,947 మంది నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేశామన్నారు. 4,698 ఇళ్ల నిర్మాణాలు పూర్తవగా, 991 గృహాలు పూర్తిదశలో ఉన్నట్టు చెప్పారు. ఈ నిర్మాణాల కోసం లబ్దిదారులకు రూ.123.38 కోట్ల బిల్లులు చెల్లించినట్టు చెప్పారు. నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఉచితంగా ఇవ్వడమేకాక, ఐకేపీ ద్వారా రూ.35వేలు, ఉపాధి ద్వారా రూ.23వేల నిధులు రుణంగా పేదలకు సహకారం అందిస్తోందన్నారు. బి.కొత్తకోట పట్టణ పేదలకు అదనంగా 1,200 మందికి ఇంటి స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత టీడీపీ పాలనలో ఐదేళ్లు పేదలకు మంజూరు చేసింది 3,619 ఇళ్లేనని అన్నారు.

మీకు రుణపడి ఉంటాం :

బలసరపెంట నుంచి బురుజుపల్లెకు కొత్తగా తారురోడ్డు నిర్మించడంపై గ్రామస్తులు ఎమ్మెల్యే ఎదుట సంతోషం వ్యక్తం చేసారు. పల్లె పుట్టినప్పటి నుంచి రోడ్డులేదని, కాలినడకన రాళ్లు, బురదలో, పొలం గట్లమీద నడుచుకొంటూ బురజుపల్లెకు వచ్చేవాళ్లమని ఇప్పుడా పరిస్థితి నుంచి విముక్తి కలిగించి రోడ్డు వేయించి మా బతుకుల్లో మార్పు తీసుకొచ్చారని అన్నారు. రహదారి నిర్మాణంతో వ్యవసాయ ఉత్పత్తుల తరలింపు, పిల్లలు పాఠశాల వెళ్లేందుకు, ఏ సమస్య ఎదురైనా వెంటనే వెళ్లేలా సౌకర్యం కలిగిందని, ఎప్పటికి రుణపడి ఉంటామని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎస్.ప్రదీప్‌రెడ్డి, ఎంపీడీఓ శంకరయ్య, సర్పంచులు లక్ష్మీదేవి, ఉమామహేశ్వరీ, నాగిరెడ్డి, సాంబశివ, జయరామిరెడ్డి, వైస్‌ఎంపీపీ ఎస్.రాధ, ఎంపీటీసీ ఆకుల కృష్ణమూర్తి, మాజీ సర్పంచు ముబీనా, ఎఫ్‌పీఓ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుద్దల వెంకటరెడ్డి, రెడ్డీశ్వరరెడ్డి, దామోదర్‌రెడ్డి, అమరనాధరెడ్డి, కుమార్‌రెడ్డి, రమణారెడ్డి, మద్దిరెడ్డి, నారాయణ, రమణ, రామయ్య పాల్గొన్నారు.

సివిల్ సప్లయిస్ గోడౌన్లో విజిలెన్స్ తనిఖీలు

మదనపల్లె : పట్టణంలోని మార్కెట్‌యార్డు సివిల్ సప్లయిస్ గోడౌన్‌లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ కమిటీ సీఐ రెడ్డెప్ప, ఏఓ బాలగంగాధర్, ఏఈఈ కిషోర్ బృందంగా ఏర్పడి గోడౌన్ రికార్డులు పరిశీలించారు. బియ్యం, కందిపప్పు, చక్కెర, పౌరసరఫరాల శాఖకు సంబంధించిన నిల్వలు, రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ.. సాధారణ తనిఖీల్లో భాగంగా గోడౌన్‌ను తనిఖీ చేశామని, తమ పరిశీలనలో గుర్తించిన అంశాలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

వృద్ధులకు వైద్యసేవలు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం అమ్మచెరువు మిట్టవద్దనున్న వెలుగు వృద్ధాశ్రమంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రామిరెడ్డి ఉచిత వైద్య సేవలు అందించారు. వృద్ధాప్యంలో చేయాల్సిన వ్యాయమాలను, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఉదయమోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, వృద్ధులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర

తంబళ్లపల్లె: కన్నెమడుగు, ఎద్దులవారిపల్లె గ్రామ పంచాయితీలలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సాగింది. ఎంపీడీఓ సురేంద్రనాథ్, సర్పంచు శ్యామలమ్మ, ఎంపీటీసీ మహేష్, బాబురెడ్డిలు సంకల్పయాత్ర వాహనానికి స్వాగతం పలికారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో మల్లయ్యకొండ చైర్మన్ మల్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు చినరెడ్డి, నాయకులు రామశంకర్‌రెడ్డి, గంట్ల సురేంద్ర, నరసింహారెడ్డి, కరీముల్లా, చంద్రశేఖర్‌రెడ్డి, మద్దిరెడ్డి, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

రేపు రక్తదాన శిబిరం

మదనపల్లె సిటీ: ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని సోమవారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్‌విషర్ వ్యవస్థాపకులు గిరీష్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు శిబిరం జరుగుతుందన్నారు.

వలసలు నివారించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

- పనులు కల్పిస్తారా..విధుల నుంచి తప్పుకుంటారా
- కరవు మండలంగా ప్రకటించినా పురోగతి లేదు
- ఉపాధి సిబ్బందిపై క్లస్టర్ ఏపీడీ మండిపాటు



ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న ఏపీడీ మధుబాబు

పెద్దతిప్పసముద్రం: ప్రతి ఒక్కరికీ పనులు కల్పించి వలసలు నివారించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వ నిర్దేశ్యాలు నీరుగార్చేలా వ్యవహరిస్తున్నారు. పెద్దతిప్పసముద్రం మండలాన్ని కరవు మండలంగా ప్రకటించినా సిబ్బంది పని తీరులో ఎలాంటి పురోగతి లేదు. కూలీలకు పనులు కల్పించలేకుంటే విధుల నుంచి తప్పుకోండని ఉపాధి హామీ క్లస్టర్ ఏపీడీ మధుబాబు సిబ్బందిని ఘాటుగా హెచ్చరిస్తూ మండి పడ్డారు. శనివారం ఆయన ఉపాధి హామీ కార్యాలయంలో మండలంలోని క్షేత్ర, సాంకేతిక సహాయకులతో పాటు ఈసీ, ఏపీవోతో సమీక్షించారు. నెలలో కనీసం వెయ్యి మంది కూలీలకు కూడా పనులు కల్పించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి రైతుల పొలాల్లో పనులు వేగవంతం అయ్యేలా ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకోవాలని హితబోధ చేసారు.

కూలీల సంఖ్య వెయ్యికి లోపే..

మండలంలో ప్రస్తుతం మండలంలో కేవలం 700 మంది మాత్రమే పని చేస్తుండటం సిబ్బంది పని తీరుకు అద్దం పడుతోంది. ఉపాధి హామీ పథకంలో సిబ్బంది కొరత లేకున్నా పనుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కూలీలకు పనులు కల్పించడంలో సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మూడు నెలల క్రితం చూస్తే మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో మొత్తం ఏడు వేల మందికి మాత్రమే పనులు కల్పించారు. అంటే సగటున ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్ రోజుకు కేవలం 12 మంది మాత్రమే పనులు కల్పించినట్లు ఆన్‌లైన్ రికార్డులు చెబుతున్నాయి.

కూలీల సంఖ్య పెంచేలా కృషి చేస్తాం

ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య తగ్గిన విషయం వాస్తవమే. అయితే ఇటీవల వర్షాల కారణంగా కూలీలు పనులు చేసేందుకు ఆశక్తి చూపలేదు. రైతుల పొలాల్లో ట్రించీలు, ఫారంపాండ్ పనుల ద్వారా కూలీల సంఖ్య పెంచి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించే దిశగా చర్యలు చేపడతామని ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు.

దళితవాడల అభివృద్ధికి కృషి

పీలేరు రూరల్ : మండలంలోని అన్ని గ్రామాల దళితవాడల అభివృద్ధికి కృషి చేస్తామని తహశీల్దార్ ధనుంజయలు అన్నారు. శనివారం మండలంలోని ముడుపులవేముల పంచాయతీ విద్యానగర్‌లో సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. మండల స్థాయి అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామానికి స్మశాన స్థలం కావాలని, అదే విధంగా విద్యుత్ స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీమోహన్‌రెడ్డి, ఎస్‌ఐ రమణ, ఏవో రమాదేవి, వీఆర్‌వో శాంతకుమార్‌రెడ్డి, సర్పంచ్ రాజేష్, దళిత నాయకులు శ్రీనివాసులు, సదాశివ, వెంకటేష్ పాల్గొన్నారు.

మా నిధులు మాకే ఖర్చు చేయండి

బి.కొత్తకోట: జైభీమ్ నగర్‌లో అభివృద్ధి కోసం వెచ్చించాల్సిన నిధులు ఇక్కడే ఖర్చు చేయాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జైభీమ్ నగర్‌లో అధికారులు సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా బాస్ జిల్లా కార్యదర్శి సింగన్న మాట్లాడుతూ నగర పంచాయతీకి చెందిన 15వ ఆర్థికసంఘం నిధులను సత్వరమే వినియోగించాలని కోరారు.పౌర హక్కులు, చట్టాల గురించి శిక్షణ డీఎస్పీ, ఎస్‌హెచ్‌ఓ ప్రశాంత్ అవగాహన కల్పించారు.

కలకడ ఎస్‌ఐ తిప్పేస్వామికి నగదు అవార్డు



ఎస్పీ క్రిష్ణారావ్ నుంచి నగదు అవార్డు అందుకుంటున్న ఎస్‌ఐ తిప్పేస్వామి

కలకడ : చోరీల నివారణ, నిందితులను పట్టుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ చూపిన కలకడ ఎస్‌ఐ తిప్పేస్వామిని జిల్లా పోలీస్ అధికారి (ఎస్పీ) క్రిష్ణారావ్ ప్రత్యేకంగా అభినందించి, నగదు వార్డుతో సత్కరించారు. శనివారం అన్నమయ్య జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఈమేరకు కలకడ ఎస్‌ఐకి నగదు బహుమతిని అందజేశారు. అంతర్‌రాష్ట్ర దొంగలముఠాను అరెస్ట్ చేయడంతోపాటు, గతంలో జరిగిన కేసుల పరిష్కారం, పురోభివృద్ధిపై ప్రశంశించారు.

తాగునీటి బోర్లు ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న జెడ్పీటీసీ గజ్జెల శృతి

కేవీపల్లె : మండలంలోని పలు గ్రామాలకు తాగునీటి బోర్లు ఏర్పాటు చేయాలని రాష్ట మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కేవీపల్లె జెడ్పీటీసీ గజ్జెల శృతి వినతిపత్రం అందజేశారు. శనివారం తిరుపతిలో మంత్రిని కలసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా గర్నిమిట్టలో తాగునీటి సమస్య పరిష్కారానికి అదనపు బోర్లు, మోటార్లు ఏర్పాటు చేయాల్సి ఉందని విన్నవించారు. అలాగే జగనన్న కాలనీల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలు మంత్రి దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు



కలికిరి: పత్తేగడలో క్రికెట్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ తిమ్మారెడ్డి

మదనపల్లె : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంపీడీఓ భానుప్రసాద్ తెలిపారు. పట్టణంలోని జెడ్పీహైస్కూల్ మైదానం, జీఆర్‌టీ గ్రౌండ్స్, బీటీ కళాశాల గ్రౌండ్స్, టిప్పుసుల్తాన్ మైదానం, వశిష్ట స్కూల్, శ్రీవేద పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉత్సాహంగా, ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, క్రికెట్, కబడ్డీ ఆటల్లో క్రీడాకారులు తమ ప్రతిభను కనపరిచారు. పోటీలు చూసేందుకు వచ్చిన ప్రజల్లో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో పీఈటీ దేవకి, ఆర్‌ఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీయడానికే క్రీడా పోటీలు

కలికిరి: క్రీడాకారులలో ప్రతిభను వెలికితీయడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రా తీసుకువచ్చారని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి అన్నారు. మండలంలోని పత్తేగడ, కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని కలికిరి-2 గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పత్తేగడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రాతో యువత పాల్గొని క్రీడలలో సత్తాచాటుకోవడానికి మంచి అవకాశమన్నారు. యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం క్రికెట్, వాలీబాల్, బ్యాట్‌మింటన్, ఖోఖో పోటీలను ప్రారంభించారు. కార్యక్రమాలలో ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, ఎంపీడీఓ గంగయ్య, స్థానిక నాయకులు వెంకటపతి, మల్లికార్జున, రామిరెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకిపురం: విద్య, క్రీడల్లో విద్యార్థులు రాణించాలని, అలాగే క్రీడలతోనే మంచి ఆరోగ్యం సాధ్యపడుతుందని సర్పంచ్ గంగులమ్మ అన్నారు. శనివారం వాల్మీకిపురం సచివాలయం 2 పరిధిలో స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడాపోటీలు నిర్వహించారు. అలాగే మండలంలోని మంచూరు పంచాయతీలో ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశవ రెడ్డి, అబ్దుల్‌కలీమ్, నీళ్లభాస్కర్, శంకర, శ్రీధర్‌రాయల్, రవి, మస్తాన్, సైపుల్లా, శ్రీనివాసులు శెట్టి, నాగరాజ, శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.